# క్షమాపణ

శ్రీ నాయుడు వెంకట సీతారామమూర్తి

సుశీల కాలేజీలో బి. ఏ. చదువుతోంది. క్లాస్ మేట్ సత్యం సుశీలకు దగ్గర బంధువు. ఆ నాలుగేళ్ల కాలేజీ జీవితంలోనూ యిద్దరూ అత్యంత సన్నిహితులయ్యారు.

పరీక్షలు ముగిశాయి.

శలవలకు యిద్దరూ స్వగ్రామానికి వచ్చేశారు. సుశీలను సత్యానికియిచ్చి వివాహం చేయాలని సుశీల తల్లి తండ్రుల సంకల్పం. సుశీల సత్యాన్ని గాఢంగా ప్రేమించింది.

ఒక నాడు_

సుశీల, సత్యం యిద్దరూ బీచికి షికారుకు వెళ్లారు.

సంధ్యా సమయం.

ఆ రోజుకు తన బాధ్యత తీరినట్టు భానుడు సముద్ర గర్భంలో దాక్కుంటున్నాడు.

హోరున సముద్ర కెరటాల ధ్వని.

చల్లనిగాలి మెల్లగ వీస్తున్నది.

సముద్ర కెరటాలు దోబూచులాడుకుంటూ సుశీల పాదాలకు చక్కిలిగింతలు పెడ్తున్నాయి.

సత్యం పరధ్యాన్నంగా ఉన్నాడు.

తన హృదయాన్ని విప్పిచెప్పాలనుకుంది సుశీల.

"సత్యం!" అని పలుకరించింది.

సమాధానం లేదు.

"ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టున్నావ్!"

"ఏమీలేదు."

"నిన్నో విషయం అడగాలి."

"అడుగు."

"మన పెళ్ళి విషయం ఆలోచించేవా?"

"లేదు."

"యిద్దరం ఏదో ఒక నిర్ణయానికి రావాలిగా!"

"నీవు నిర్ణయించుకున్నావా?"

"ఆ"

"ఏమని?"

"నిన్నే పెళ్ళిచేసుకోవాలని."

"మంచి ఆలోచనే."

"నీ ఉద్దేశం?"

"అదే ఆలోచిస్తున్నాను."

"ఇష్టంలేదా?"

"ఎంత అమాయకురాలివి సుశీలా?"

"చిన్నప్పటినుంచీ కలసి మెలసి ఉన్నాం. ఒకరి హృదయాన్ని ఒకరు అర్ధంచేసుకోగలిగేం."

"అదే పొరపాటు."

"పొరపాటా?"

"అవును. నా హృదయాన్ని నీవు పూర్తిగా అర్థంచేసుకోలేదు."

"చేసుకున్నాను."

"చేసుకుంటే యిట్లా మాట్లాడవు. నన్ను అర్థం చేసుకున్నానని అపోహపడుతున్నావు. కానీ నాలోని భావాలు నీకు పూర్తిగా తెలీవు,"

"ఎందుకని?"

“తర్వాత చెప్తాను.”

“దేన్ని గురించో ఆలోచిస్తున్నట్టున్నావు. నాతో చెప్పకూడదా!”

“కూడదని కాదు. చెప్తే నీవూ బాధపడతావు.”

“పర్వాలేదు చెప్పు.”

“ఈ వేళ ఆంధ్రపత్రికలో ఉష శ్రీ కథానిక చదివేను. దానిలోని విషాద సంఘటన జ్ఞప్తికి వచ్చింది.”

“ఏమిటది?”

“ఒక యువతి ఒక యువకుణ్ణి ప్రేమించింది.”

“కథల్లో అది మామూలే.”

“యువకుడు మాత్రం ప్రేమించలేదు.”

“అమ్మాయి అందంగా లేదనా?”

“కాదు. తన తాహతుకి సరిసమానంగా లేదని.”

“ఆ విషయం అమ్మాయితో చెప్పేడా?”

“లేదు. కానీ ఆ అమ్మాయి రూపురేఖల్ని చూచి మురిసిపోయాడు. ఒకనాటి వాతావరణం అతనిలో ఉన్న దుష్టశక్తుల్ని విజృంభింపజేసింది. కామోద్రేకంతో కళ్లుగానక ఆ యువతిని అనుభవించేడు.”

“ఆమె అంగీకరించిందా?”

“ఏంచేస్తుంది? అబల. పెళ్ళిచేసుకుంటానని నమ్మించేడు. తన కామవాంఛ తీర్చుకోడానికి ప్రయత్నించేడు. అమ్మాయి అంగీకరించలేదు. చివరకు బలత్కారంచేసి తన కోర్కెను తీర్చుకున్నాడు.”

“ఎంత దారుణం!”

“పాపం! ఆ కన్యకు ఆరోనెల. తల్లిదండ్రులు ఆమెను గెంటివేశారు. సంఘం ఆమెను బహిష్కరించింది. ఆమె యిప్పుడు అనాథ. ఏకాకి ఒంటరిగా పూరిగుడిసెలో కాలంగడుపుతోంది.”

“ఛీ! ఆ దుర్మార్గుణ్ణి నిలువునా కాల్చివేసినా పాపం లేదు. నేనే అయితే -”

“ఏంచేద్దువు?”

“తగిన రీతిగా బుద్ధి చెపుదును.”

“బుద్ధిరాకపోతే?”

“సంఘంలో యిటువంటి చీడపురుగులు ఉండకూడదని హత్యచేసైనా, కక్ష తీర్చుకుందును.

“అయితే కానియ్యి. నన్ను చంపు.”

“నిన్నా?”

“అవును. ఆశ్చర్యపడకు సుశీలా! ఆ కన్య శీలాన్ని దోచుకున్న దుర్మార్గుణ్ణి నేనే.”

“ఎంతపని చేశావ్!”

“అందుకనే నా హృదయాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదన్నాను.”

“ఎంత అన్యాయం!”

“నన్ను మన్నించు సుశీలా. నా నేరానికి ఏదైనా సరే శిక్ష విధించు. అనుభవిస్తాను.”

“మన్నించేది నేను కాదు. తిన్నగా వెళ్ళి ఆ యువతి కాళ్లమీదపడి మన్నించమని కోరు. ఆమెను నీ అర్ధాంగిగా స్వీకరించు.”

సత్యం నిర్ఘాంతపోయాడు.

